క్లుప్తంగా

పశువులకు టీకాలు



టీకా వేస్తున్న జిల్లా వైద్యాధికారి శంకర్

లక్సెట్టిపేట: వర్షాకాలంలో పశువులకు వ్యాధులు ప్రబలకుండా చూసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి శంకర్ అన్నారు. మండలంలోని పోతపల్లిలో గురువారం 160 పశువులకు టీకాలు వేసి రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్వేత, తిరుపతమ్మ, సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

విలేకరుల సభ్యత్వం రద్దు

పాతమంచిర్యాల: బెల్లంపల్లి పట్టణానికి చెందిన విలేకరులు బద్రి శివప్రసాద్, బద్రి వెంకటేశ్వర్లు యూనియన్ సభ్యత్వం రద్దు చేస్తున్నట్లు తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు డేగ సత్యం, ప్రధాన కార్యదర్శి పింగిళి సంపత్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సదరు విలేకరులపై మావోయిస్టు కోల్‌బెల్ట్ కమిటీ కార్యదర్శి పేరుతో పలు ఆరోపణలతో కూడిన బహిరంగ ప్రకటన వెలువడిన నేపథ్యంలో రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు వారిపై చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు.

బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక

జన్నారం: మండలంలోని కిష్టాపూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటీ కళాశాలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు రాజన్న తెలిపారు. గురువారం ఫలితాలు విడుదల కావడంతో పాఠశాలకు చెందిన విజయ్‌కుమార్, ఈశ్వర్, సాయివర్ధన్ విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు.

నర్సింగ్ పోస్టుల ప్రొవిజనల్ జాబితా ప్రదర్శన

మంచిర్యాలటౌన్: జాతీయ ఆరోగ్య మిషన్ కింద జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఎన్‌ఎచ్‌ఎం స్టాఫ్ కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ పోస్టులకు సంబంధించిన సీనియర్ ట్యూబర్క్యులోసిస్ ల్యాబోరేటరీ సూపర్‌వైజర్(ఎస్‌టిఎల్‌ఎస్) 1పోస్టుకు సంబంధించిన ప్రొవిజనల్ జాబితాను డీఎంహెచ్‌వో కార్యాలయంలో, జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ప్రదర్శించినట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ అనిత ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 6వ తేదీ నుంచి 8వ తేదీ సాయంత్రం 5గంటల్లోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు.

యెల్లో, రెడ్ కార్డు జారీ విధానం రద్దు చేయాలి

మందమర్రిరూరల్: కార్మికులను మనోవేదనకు గురి చేయడానికే యాజమాన్యం యెల్లో, రెడ్ కార్డు జారీ విధానాన్ని ప్రవేశపెట్టిందని వెంటనే, ఆ విధానాన్ని రద్దు చేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఏరియాలోని కేకే–గనిపై గురువారం ఆందోళన నిర్వహించి ఆ గని మేనేజర్ అల్లావుద్దీన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ ఏరియా, ఫిట్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్ విజయవంతం



చెన్నూర్‌లో బంద్ చేయిస్తున్న నాయకులు

చెన్నూర్/జైపూర్/కాసిపేట/కోటపల్లి: నీట్ సహా ఇతర పేపర్ల లీకేజీను నిరసిస్తూ విద్యాసంస్థల బంద్‌కు పలు విద్యార్థి సంఘాలు పిలుపునివ్వగా విజయవంతం అయింది. కోటపల్లి మండలంలోని శంకరాపూర్, బమన్‌పల్లి పాఠశాలలను ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు బంద్ చేయించారు. కాసిపేటలో ఎన్‌ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు విద్యాసాగర్, ఎస్‌ఎఫ్‌ఐ మండల కార్యదర్శి కొమ్ముల రజిత ఆధ్వర్యంలో వేర్వేరుగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను మూసివేయించారు. జైపూర్‌లో ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షులు అహ్మద్ పాషా ఆధ్వర్యంలో విద్యాసంస్థలను బంద్ చేయించారు. చెన్నూర్‌లో ఐక్య విద్యార్థి సంఘాలు ఇచ్చిన దేశవ్యాప్త బంద్ పిలుపులో భాగంగా పాఠశాలలు, కళాశాలలు బంద్ పాటించారు. ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు బంద్ చేయగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలను విద్యార్థి సంఘాల నాయకులు బంద్ చేయించారు.

సమయపాలన ఏది?

వేమనపల్లి: మారుమూల గ్రామాల్లో ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదు. ఎప్పుడు వస్తారో, పోతారో తెలియని అయోమయం నెలకొంది. రాజారాం పాఠశాల ఉపాధ్యాయురాలికి బదిలీ ఉత్తర్వులు రాగా రిలీవ్ ఆర్డర్ రాలేదు. తాను బదిలీపై వెళ్లే వ్యక్తినని, ఇష్టారాజ్యంగా విధులకు వస్తూ పోతున్నారు. గురువారం 9.50నిమిషాలకు కూడా ఉపాధ్యాయురాలు పాఠశాలకు రాకపోవడంతో విద్యార్థులు బయటనే వేచి ఉన్నారు.

జాతీయ రహదారి ఛిద్రం..!

- భీమారం మండలం జోడువాగుల వద్ద అధ్వానంగా రోడ్డు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



భీమారం సమీపంలోని జోడువాగుల వద్ద రోడ్డు పరిస్థితి



చెన్నూర్‌రూరల్/భీమారం: మంచిర్యాల–చెన్నూర్ జాతీయ రహదారిలో భీమారం సమీపంలోని జోడువాగుల వద్ద రోడ్డు అధ్వానంగా ఉంది. గత పది రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో దాదాపు కిలోమీటరు పొడువు బీటీ రోడ్డు లేకపోవడంతో గుంతలమయంగా మారి అందులో నీళ్లు నిలుస్తున్నాయి. దీంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. నిజామాబాద్ నుంచి మంచిర్యాల మీదుగా చెన్నూర్, జగ్దల్‌పూర్ వరకు జాతీయ రహదారిగా మార్చిన కేంద్ర ప్రభుత్వం రెండు వరసల రహదారిగా అభివృద్ధి చేస్తుంది. జోడు వాగులపై గల ఇరుకువంతెనను తొలగించి రెండు వరసల వంతెన నిర్మాణం కోసం అటవీశాఖ భూమి సేకరించేందుకు 20ఏళ్ల నుంచి నేషనల్ హైవేస్ ప్రయత్నాలు చేస్తుంది. కానీ ఇప్పటి వరకు అనుమతులు లేని కారణంగా వంతెన నిర్మాణం జరగడం లేదు. వంతెన వద్ద ఉన్న మూల మలుపులు తొలగించేందుకు అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు ఇప్పుడు గల ఇరుకువంతెన వద్ద కిలోమీటరు పొడువు రోడ్డుని రెండు వరసలుగా అభివృద్ధి చేయలేదు. దీంతో గతంలో నిర్మించిన సింగిల్ రోడ్డు పూర్తిగా ధ్వంసమై గుంతలమయంగా మారింది. గత నాలుగేళ్ల నుంచి గుంతలు మరింత ఎక్కువ కావడంతో వర్షం నీళ్లు అందులో నిలిచి, రాకపోకలకు ఇబ్బందిగా మారుతుంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వంతెన వద్ద కిలోమీటర్ పొడువు బీటీ రోడ్డు నిర్మిస్తే బాగుంటుందని ప్రజలు కోరుతున్నారు. ఈ సందర్భంగా భీమారం సమీపంలోని జోడువాగుల వద్ద రోడ్డు పరిస్థితిని పరిశీలించేందుకు చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి శుక్రవారం జోడువాగల వద్దకి రానున్నారు.

నూతన పాఠ్యప్రణాళికపై అవగాహన పెంచుకోవాలి



కాసిపేట: శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీలు

బెల్లంపల్లి: అంగన్‌వాడీ కార్యకర్తలు పూర్వ ప్రాథమిక విద్య నూతన పాఠ్య ప్రణాళికపై తగిన అవగాహన పెంచుకోవాలని బెల్లంపల్లి సీడీపీవో ఎం.ఉమాదేవి అన్నారు. బెల్లంపల్లిబస్తీ, మాదారం సెక్టార్‌ల పరిధిలోని అంగన్ వాడీ కార్యకర్తలకు గురువారం అవగాహణ, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ తరగతుల్లో రిసోర్స్‌పర్సన్ మమత, సూపర్‌వైజర్లు ప్రభావతి, ఇందిర, పోషన్ అభియాన్ కో ఆర్డినేటర్ సుజాత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కాసిపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నూతన జాతీయ విద్యావిధానంలో బోధనను ప్రారంభించుకోవాల్సిందిగా ఐసీడీఎస్ సీడీపీవో ఉమాదేవి తెలిపారు. మండల కేంద్రంలోని ముత్యంపల్లి రైతువేదికలో గురువారం కాసిపేట, బెల్లంపల్లి మండలం చొప్పరిపల్లి క్లస్టర్‌ల అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, జ్యోతి, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు తదితరులున్నారు.

న్యాయం చేయాలని బాధితుల ఆందోళన



ఆందోళన చేస్తున్న బాధితులు

నస్పూర్: తన ఇంటిని మున్సిపల్ అధికారులు అకారణంగా కూల్చివేశారని, తనకు న్యాయం చేయాలంటూ ఓ వ్యక్తి తన కుటుంబ సభ్యులతో కలిసి మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం ఆందోళనకు దిగారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట బైఠాయించి అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బాధితుడు జి దశరయ్య మాట్లాడుతూ.. నేను పట్టణ పరిధిలోని ఠాగూర్ నగర్‌లో నివాసం ఉంటానని, తనకు చెందిన తన ఇంటిని మున్సిపల్ అధికారులు రెండు రోజుల క్రితం వచ్చి అకారణంగా కూల్చివేశారని ఆరోపించారు. తన ఇంటికి సంబంధించిన అన్ని డాక్యుమెంట్లు తన వద్ద ఉన్నాయని మున్సిపల్ అధికారులు ఎలాంటి ముందస్తు నోటీసులు జారీ చేయకుండా, తన ఇంటిని కూల్చివేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులు తనకు న్యాయం చేసే వరకు ఇక్కడి నుంచి కదిలేదిలేదన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళనకారులను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై కమిషనర్ చిట్యాల సతీష్ మాట్లాడుతూ.. ఆ ఇంటికి ఎలాంటి అనుమతులు లేవని, నోటీసులు సైతం జారీ చేశామన్నారు. విధులకు ఆటంకం కలిగించినందుకు ఆ వ్యక్తులపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

నేరాల నియంత్రణకు 'పల్లె నిద్ర'
భీమిని: నేరాల నియంత్రణకే పల్లె నిద్ర నిర్వహిస్తున్నట్లు తాండూర్ సీఐ కుమారస్వామి పేర్కొన్నారు. కన్నెపల్లి మండలంలోని పోలంపల్లిలో బుధవారం రాత్రి పల్లెనిద్ర నిర్వహించారు. కార్యక్రమంలో కన్నెపల్లి ఎస్సై గంగారాం, మాజీ సర్పంచ్ పనాస అంజన్న, పోలీసులు పాల్గొన్నారు.

'మైనార్టీలకు సీట్లు ఇవ్వడం లేదనడం సరికాదు'
కాసిపేట: మండలంలోని దేవాపూర్ ఓరియంట్ కంపెనీ డీఏవీ పాఠశాలలో మైనార్టీలకు సీట్లు ఇవ్వడం లేదని ఎంఐఎం నాయకుడు అలీ విమర్శించడం సరికాదని మైనార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యక్తిగత పనులు కాకపోవడంతో సంస్థను మైనార్టీల పేరుతో విమర్శించడం సరికాదన్నారు.

పోలంపల్లిలో వనమహోత్సవం
భీమారం: మండలంలోని పోలంపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో గురువారం వనమహోత్సవం నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యదర్శి సృజనతో పాటు మహిళలు కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ నాటాలని ఆమె కోరారు. ఇందులో ఉపాధ్యాయులు, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ నక్క రాజన్నతో పాటు మహిళలు పాల్గొన్నారు.

'సమస్యలుంటే పోలీసులను ఆశ్రయించండి'
చెన్నూర్: ప్రజా రక్షణకే పోలీసులున్నారని, ఎలాంటి సమస్యలున్నా పోలీసులను ఆశ్రయించాలని చెన్నూర్ ఎస్సై శ్వేత అన్నారు. స్థానిక కస్తూర్బా కళాశాలలో విద్యార్థులకు షీటీంపై ఆమె అవగాహన కల్పించారు.

విద్యార్థులకు అభినందన
బెల్లంపల్లి: మంచిర్యాల డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బెల్లంపల్లి ఎస్ఎస్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక తిలక్ స్టేడియంలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

కార్యవర్గం ఎన్నిక
పాతమంచిర్యాల: జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి పట్టణ కార్యవర్గ ఎన్నికలు జిల్లా కేంద్రంలో గురువారం నిర్వహించారు. పట్టణ ప్రధాన కార్యదర్శిగా పంపరి వేణుగోపాల్, ఉపాధ్యక్షుడిగా కట్కూరి శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

నూతన కమిటీ నియామకం
లక్సెట్టిపేట: అఖిల భారత న్యాయవాద పరిషత్ నూతన కమిటీని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు డేగ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలాధ్యక్షుడిగా నళినికాంత్, ఉపాధ్యక్షులుగా తిప్పని రవి, తాజోద్దీన్, అశోక్ ఎన్నికయ్యారు.

ఎమ్మెల్యే చేయూత
మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గుడిపేటకు చెందిన దేవి సత్యనారాయణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలిసిన ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు రూ.5వేల ఆర్థిక సాయం ప్రకటించారు. గురువారం కాంగ్రెస్ శ్రేణుల చేతుల మీదుగా బాధిత కుటుంబానికి అందజేశారు.

ఎన్ఎంఎంఎస్‌పై అవగాహన
దండేపల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పై విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శంకర్‌గౌడ్, ఉపాధ్యాయులు గురువారం సమావేశం నిర్వహించారు. ఎన్ఎంఎంఎస్ కోసం విద్యార్థులకు ప్రతి రోజు ప్రత్యేక క్లాసులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు కూడా విద్యార్థులపై దృష్టి సారించి, ఇంటి వద్ద చదివేలా చూడాలన్నారు.

సన్మానం
తాండూర్/కాసిపేట: ఎంపీటీసీల పదవీ కాలం ముగియడంతో గురువారం తాండూర్ మండల పరిషత్ కార్యాలయంలో, కాసిపేటలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఎంపీపీ, ఎంపీటీసీలు, కో ఆప్షన్ సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

పారిశుధ్య పనులు చేపట్టాలి
కోటపల్లి: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతీరోజు గ్రామాల్లో పారిశుధ్య పనులు తప్పక చేపట్టాలని ఎంపీవో సత్యనారాయణ కార్యదర్శులకు సూచించారు. నక్కలపల్లి గ్రామపంచాయతీని గురువారం సందర్శించి దోమల నివారణకు తగు జాగ్రత్తలు పాటించేలా సూచనలు చేస్తూ వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు.

ఘనంగా ఉపాధ్యాయులకు సన్మానం
మంచిర్యాలఅర్బన్: సుదీర్ఘకాలం గర్మిళ్ల హైస్కూల్ పాఠశాలలో విధులు నిర్వర్తించి బదిలీ, పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులను గురువారం ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

ఆధ్యాత్మికం

మాంతమ్మకు ప్రత్యేక పూజలు

భీమారం: మండలంలోని పోలంపల్లి సమీపంలో గల మాంతమ్మ ఆలయ వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. భీమారం, పోలంపల్లి, అంకుసాపూర్ ,శ్రీరాంపూర్ నుంచి పెద్ద ఎత్తున వచ్చిన భక్తులు గ్రామ దేవతకి మేకలు, కోళ్లు బలిచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

మడేలేశ్వరస్వామికి పూజలు



పూజలు నిర్వహిస్తున్న రజకులు

లక్సెట్టిపేట: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామంలోని రజకులు మడేలేశ్వరస్వామి పూజలు గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకుని నైవేద్యాలు సమర్పించారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న ముదిరాజ్‌లు

దండేపల్లి: మండలంలోని నర్సాపూర్‌లో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీపెద్దమ్మతల్లి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ఠాపన పూజలను కరీంనగర్‌కు చెందిన బైండ్ల పూజారులు ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో గ్రామానికి చెందిన ముదిరాజ్ కులస్తులు, గ్రామస్తులు పాల్గొని పెద్దమ్మతల్లికి పూజలు చేశారు. భక్తులకు కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు అన్నదానం చేశారు.

వాహన తనిఖీలతో దొంగతనాలకు చెక్

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జైపూర్ ఏసీపీ

చెన్నూర్: వాహనాల తనిఖీలతో దొంగతనాలకు చెక్ పెట్టే అవకాశం ఉంటుందని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. రామగుండం పోలీసు కమిషనర్ శ్రీనివాస్, మంచిర్యాల డీసీపీ బాస్కర్‌ల ఆదేశాల మేరకు గురువారం రాత్రి చెన్నూర్‌ను అష్ట దిగ్బంధనం చేసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు నంబర్ ప్లేట్లు లేని వాహనాలతో వచ్చి చోరీలకు పాల్పడుతున్నారని తెలిపారు. తనిఖీలలో నంబర్ ప్లేట్లు లేని వాహనాలను పట్టుకుంటే, దొంగలు దొరికే అవకాశం ఉంటుందన్నారు. అంతే కాకుండా మైనర్లు ర్యాష్ డ్రైవింగ్ చేయకుండా చర్యలు చేపట్టే అవకాశం ఉంటుందన్నారు. కొత్త చట్టాలు కఠినంగా ఉన్నాయని, చిన్నారులకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వద్దని తెలిపారు. నిత్యం తనిఖీలు కొనసాగుతాయన్నారు. ఇందులో డ్రంక్ డ్రైవ్ తనిఖీలను సైతం చేపడుతామని తెలిపారు. వర్షాలు కురిసినప్పడు వాహనాలు జారి కిందపడుతాయని, గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే వ్యక్తులు తప్పనిసరిగా హెల్మెట్లు పెట్టుకోవాలని సూచించారు. తనిఖీలలో నంబర్ ప్లేట్లు లేని 50వాహనాలను పట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చెన్నూర్, చెన్నూర్‌రూరల్ సీఐలు రవీందర్, సుధాకర్, జైపూర్ సబ్ డివిజనల్ పరిధిలోని ఎస్సైలు, వంద మంది పోలీసులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



తాండూర్: వాహనదారుడికి కౌన్సెలింగ్

రామకృష్ణాపూర్/తాండూర్: వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తాండూర్ సీఐ కుమారస్వామి, రామకృష్ణాపూర్ పట్టణ ఎస్సై రాజశేఖర్ హెచ్చరించారు. రామకృష్ణాపూర్ పట్టణంలోని పలు ప్రాంతాల్లో, తాండూర్ ఐబీ కేంద్రంలో పోలీసులు గురువారం వాహనాలు తనిఖీ చేశారు. సరైన పత్రాలు, నంబర్ ప్లేట్ సరిగ్గా లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలు వెంట ఉంచుకోవాలని రోడ్లపై ఇతరులకు ఇబ్బందులు కలిగించేలా వాహనాలు నడుపరాదని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తాండూర్ ఎస్సై కిరణ్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జీఎం కార్యాలయం, శ్రీరాంపూర్ బస్టాండ్ వద్ద సీఐ మోహన్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 30 టూ వీలర్లు, ఆటో, లారీలను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ ఎస్సై సంతోశ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య వర్ధంతి



శ్రద్ధాంజలి ఘటిస్తున్న కామ్రేడ్స్

బెల్లంపల్లి: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని గురువారం బెల్లంపల్లిలో నిర్వహించారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన వర్ధంతిలో కామ్రేడ్స్ పాల్గొని కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి విప్లవ జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సింగరేణి విభాగం, సీపీఐ నాయకులు ఎం.వెంకటస్వామి, చిప్ప నర్సయ్య, దాగం మల్లేష్, బీకేఎంయూ జాతీయ సమితి సభ్యుడు అక్కెపల్లి బాపు, పట్టణ సీపీఐ కార్యదర్శి ఆడేపు రాజమొగిలి తదితరులు పాల్గొన్నారు.

అర్హులు దరఖాస్తు చేసుకోండి

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల మంచిర్యాలలో ఖాళీగా ఉన్న కంప్యూటర్ సైన్స్ పోస్టు భర్తీ కోసం అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ వి.చక్రపాణి తెలిపారు. సంబంధిత పీజీ సబ్జెక్టులో కనీసం 55శాతం మార్కులుండాలని ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం ఉంటే సరిపోతుందన్నారు. పీహెచ్‌డీ, ఎన్ఈటీ, ఎస్ఎల్ఈటీ, ఎస్ఈటీ ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుందన్నారు. సంబంధిత ధృవపత్రాలతో ఈ నెల 6లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 8న ఇంటర్వ్యూ ఉంటుందని ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు.

బెల్లంపల్లిలోని న్యాక్ సెంటర్‌లో...
బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని న్యాక్ సెంటర్‌లో కంప్యూటర్ స్కిల్స్, ఇంగ్లిష్ స్కిల్స్ నేర్పించడానికి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా న్యాక్ ఏడీ.ఎం.నాగేంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు అవుట్ సోర్సింగ్ విధానంలో పనిచేయాల్సి ఉంటుందని, ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.15వేలు వేతనం చెల్లిస్తూ వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు ఎంఏ ఇంగ్లిష్, కంప్యూటర్ ట్రైనింగ్ తీసుకున్న సర్టిఫికేట్ ఉండాలని తెలిపారు. మంచిర్యాల జిల్లా వాసులై ఉన్న బ్యాచిలర్ యువకులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 83286 22455 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఈ నెల 6వ తేదీ సాయంత్రం 4 గంటల వరకు బెల్లంపల్లిలోని వైటీసీలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

ఐటీఐలో సీట్ల కోసం...
మందమర్రిరూరల్: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో మొదటి దఫాలో భర్తీ కాగా, మిగిలిన సీట్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీఐ ప్రిన్సిపాల్ దేవానంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి మార్కులు, రిజర్వేషన్ ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుందని, ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.



భీమిని: బాధ్యతలు స్వీకరిస్తున్న జగన్మోహన్‌రెడ్డి



దండేపల్లి: ప్రత్యేకాధికారికి బొకే అందిస్తూ...



భీమారం: బాధ్యతలు చేపడుతున్న చిన్నయ్య

బాధ్యతలు స్వీకరించిన ప్రత్యేకాధికారులు



హాజీపూర్‌లో...



నెన్నెల: ప్రత్యేక అధికారిని సన్మానిస్తూ...



జైపూర్: బాధ్యతలు స్వీకరిస్తున్న గణపతి

నెన్నెల/బెల్లంపల్లిరూరల్/భీమారం/జైపూర్/భీమిని/దండేపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండల ప్రజా పరిషత్‌లో సభ్యుల ఐదేళ్ల పదవీ కాలం ముగిసింది. ప్రత్యేక పాలనలో భాగంగా దండేపల్లి మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా జిల్లా దళిత అభివృద్ధి శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, భీమారం మండల ప్రత్యేక అధికారిగా జిల్లా సంక్షేమ అధికారి చిన్నయ్య, బెల్లంపల్లి మండల ప్రత్యేక అధికారిగా జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సీ.హెచ్ దుర్గాప్రసాద్, హాజీపూర్ మండల ప్రజాపరిషత్ ప్రత్యేకాధికారిగా మంచిర్యాల జిల్లా విద్యాశాఖ అధికారి(డీఈవో) యాదయ్య, నెన్నెల మండల ప్రత్యేక అధికారిగా మంచిర్యాల జిల్లా ఏడీ (సర్వే అండ్ లాండ్ రికార్డ్) అధికారి ఎం.శ్రీనివాస్, జైపూర్ మండల ప్రత్యేక అధికారిగా జెడ్పీ సీఈవో గణపతి, భీమిని ప్రత్యేక అధికారిగా మైన్స్ అండ్ జియాలజీ ఏడీ జగన్మోహన్‌రెడ్డి, కన్నెపల్లి మండలానికి జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఎం.హరినాథ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు.

కోడెకు దహన సంస్కారాలు



మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని చున్నంబట్టి వాడకు చెందిన కొంపెల్లి శ్రీనివాస్ (దివ్యాంగుడు) ఉపాధి కోసం దేశీవాలి ఆవులను పెంచుతున్నాడు. అందులో పుంగనూరు జాతికి చెందిన కోడె(మగ) గురువారం మరణించగా, ఎంతో ప్రేమగా చూసుకుంటున్న కోడెను హిందూ సంప్రదాయ ప్రకారం పూజలు చేసి పూడ్చిపెట్టినట్లు ఆయన తెలిపారు.